భూగర్భ డ్రైనేజీ కలేనా?

- ప్రశ్నిస్తున్న బంగారుమెట్ట వాసులు
- 2009లో నిలిచిపోయిన పనులు
- నేటికీ పూర్తికాక స్థానికుల నిరీక్షణ


కుమ్మరవీధిలో నిరుపయోగంగా మారిన మ్యాన్ హోల్


భూగర్భ డ్రైనేజీ నిర్మాణం జరగాల్సిన బంగారుమెట్ట జంక్షన్


భూగర్భ డ్రైనేజీ నిర్మించాల్సిన బంగారుమెట్టలోని జీవీఎంసీ స్కూల్ రోడ్డు

అల్లిపురం : భూగర్భ డ్రైనేజీ పనులు తమకు కలేనా? అని బంగారుమెట్ట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఈ పనులు ప్రారంభించారు. అల్లిపురంలోని పలు ప్రాంతాల్లో ఈ పనులు పూర్తయ్యాయి కూడా. 2009లో మహానేత అకాల మరణం చెందడంతో బంగారుమెట్ట, వివేకానందకాలనీ, నీలమ్మ వేపచెట్టు రోడ్డు, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో మాత్రం భూగర్భ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. తర్వాత ఈ పనులకు రాళ్లు అడ్డురావటంతో పనులు అసంపూర్తిగా నిలిపేసి రోడ్లు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు జరగకపోవటంతో బంగారుమెట్ట ప్రాంత వాసులకు భూగర్భ డ్రైనేజీ అనేది కలగానే మిగిలిపోయాయి.

ప్రభుత్వాలు మారినా..

2009 నుంచి ప్రభుత్వాలు మారినా పనులు మాత్రం పునః ప్రారంభం కాకపోవటంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నగరంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయినప్పటికీ అల్లిపురంలోని కొన్ని ప్రాంతాల్లో నేటికీ ఈ పనులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా భూగర్భ విద్యుత్ పనులు చేపట్టి పూర్తి చేశారు. వాటికి లేని అడ్డంకి భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా భూగర్భ డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

పనులు చేపట్టండి..



బంగారుమెట్టతో పాటు కుమ్మరవీధి తదితర ప్రాంతాల్లో నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తి చేయాలి. గతంలో పలు మార్లు వినతిపత్రాలు ఇచ్చినా పనులు ప్రారంభించలేదు. తక్షణమే పనులు చేపట్టి మాకు భూగర్భ డ్రైనేజీ అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– మద్దాల వెంకట అప్పారావు, కుమ్మరవీధి

మ్యాన్ హోల్స్ ఉన్నా నిరుపయోగం..



బంగారుమెట్ట, కుమ్మరవీధి ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు కొంత మేర పూర్తయ్యాయి. అల్లిపురం మెయిన్‌రోడ్డులో పనులు మొదలుపెట్టలేదు. అందువల్ల వీటి కనెక్షన్లు ఇవ్వడం మానేసారు. దీని వల్ల నగరమంతా భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయినా అల్లిపురం, బంగారుమెట్ట, కుమ్మరవీధి ప్రాంతాల్లో పనులు పూర్తి కాలేదు. తక్షణమే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– భీశెట్టి రాజు, బంగారుమెట్ట


సాంకేతికతతో మెరుగైన నైపుణ్యం


ఒప్పందం కుదుర్చుకుంటున్న అధికారులు

అల్లిపురం : విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవడం ద్వారా టెలికాం రంగంలో రాణించవచ్చని బీఎస్ఎన్ఎల్ పీజీఎం (ఆపరేషన్స్) పి.పాల్ విలియం తెలిపారు. అమలాపురంలోని బొన్నా వెంకట చలమయ్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌తో విశాఖలోని బీఎస్ఎన్ఎల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. రాజమండ్రిలోని బీవీసీఈసీ ప్రాంగణంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి అందించేందుకు, వారిని వ్యవస్థాపకులుగా మార్చేందుకు తగిన శిక్షణ ఇచ్చేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుంది. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డీసీఎం ఆపరేషన్స్ కె.జగదీశ్వరరావు, డీజీఎం బి.శ్రీనివాసరావు, డీసీఎం సీఎం ప్రాజెక్ట్స్ ఆర్.శ్రీకాంత్ పట్నాయక్, అధికారులు ఎస్‌వీబీ శ్రీదేవి, బీఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులతో ముప్పే

- నేడు ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం



మహారాణిపేట : ఆహారపుటలవాట్లు కాలేయ వ్యాధులకు ప్రధాన కారణం. వీటికి తోడు అనేక కారణాల వల్ల హెపటైటిస్ వైరస్‌లు సోకుతున్నాయి. తీవ్రమైన వత్తిడి, వ్యాయామం లేకపోవడం వల్ల ఈ వ్యాధులు వస్తున్నాయి. నిర్లక్ష్యం కారణంగా అనేక మంది మృత్యువాత పడుతున్నారు. జూలై 28 (ఆదివారం) ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం పలు కార్యక్రమాలు చేపట్టాయి. స్క్రీనింగ్ ప్రచారం, అవగాహన ప్రచారాలు, ఉచిత టీకా వంటి కార్యకలాపాలు నిర్వహిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా కాలేయ వ్యాధికి హెపటైటిస్ వైరస్ ముఖ్యమైన కారణం. దీని వల్ల కాలేయ సిరోసిస్, కాలేయ క్యాన్సర్ వంటివి సోకుతున్నాయి. ఈ వ్యాధిలో కామెర్లు, అలసట, పొత్తికడుపు నొప్పి, ముదురు మూత్రం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సంవత్సరం పొడవునా సేవలు..

2008లో గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్‌వోడీ దివంగత ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణ పలు సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ కార్యక్రమాలను సంవత్సరం పొడవునా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 19 వేల మందికి పైగా ఉచిత టీకాలు వేశారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మైక్రోబయాలజీ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ సుజాత స్క్రీనింగ్‌కు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ప్రతి బుధవారం ఉచిత మందులు ఇస్తున్నారు. ఇప్పటి వరకు తొమ్మిది వేల మందికి పైగా రోగులు ప్రయోజనం పొందారు. ప్రతి సోమవారం సేవలందిస్తున్నారు.

నేడు లివర్ వాక్

ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజీలోని మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం లివర్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్ తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కే బీచ్‌లో లివర్ వాక్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభిస్తారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ దిగ్గజాలు డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ విశ్వనాథ్, ఇతర గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, ప్రజలు పాల్గొంటారు.

వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- 36 గ్రాముల బంగారం స్వాధీనం
- క్రైమ్ డీసీపీ వెంకటరత్నం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వెంకటరత్నం

ఎంవీపీకాలనీ : గత కొంతకాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడ్ని ఎంవీపీ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటనపై నగర క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు, ఎంవీపీ క్రైమ్ సీఐ సీహెచ్ శ్రీనివాసరావు శనివారం రాత్రి ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెదజాలరిపేట, గాంధీ సెంటర్ సమీపంలోని గెంబలి శారద ఇంట్లో ఈ నెల 22 రాత్రి దొంగతనం జరిగింది. పెద్ద ఎత్తున బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు ఆదేశాలతో ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ శ్రీనివాసరావుతో పాటు ఎస్ఐ జగదీష్ ఇతర సిబ్బంది ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నిందితుడి కోసం గాలించారు. అదే ప్రాంతానికి చెందిన గుర్రపు శివ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో అతనిపై నిఘా పెట్టి శనివారం చాకచక్యంగా పేదవాల్తేర్ ఆర్టీసీ డిపో సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను నేరం అంగీకరించాడు. 36.76 గ్రాముల బంగారం, 2,604 గ్రాముల వెండితో పాటు రూ.31,200లు స్వాధీనం చేసుకున్నారు. అయితే గుర్రపు శివపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతను చెడు వ్యసనాలకు బానిసై వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో అతని నుంచి మరిన్ని వివరాలు రాబడుతున్నారు. కేసు ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జగదీష్‌ల బృందానికి క్రైమ్ డీసీపీ ఏ.వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు అభినందనలు తెలిపారు.

డయేరియాపై అవగాహన


వైద్య విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట : ప్రపంచ ఓఆర్ఎస్ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేజీహెచ్ పిల్లల వార్డులో వైద్య విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల వితరణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు గైస్ పూర్వ విద్యార్థులు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 1971–75 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. కాలేజీలో చదువుతున్న నాలుగు బ్రాంచీల్లో టాపర్లకు ప్రామాణిక పాఠ్యపుస్తకాలు అందజేశారు. కెమికల్ ఇంజినీరింగ్ నుంచి కె.దేష్న, జి.ధనుంజయ్, పెట్రోకెమికల్స్ నుంచి బి.రాజ్యశ్రీ, పి.మనోజ్, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ నుంచి ఇ.ప్రవంతి, ఎం.రేవంత్, ఆయిల్ టెక్నాలజీ నుంచి కె.సాయిప్రణతి, ఎస్.మోహన్ పుస్తకాలు అందుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నుంచి వి.రామచంద్రరావు, వి.నాగభూషణం, పి.కనకసాయి, జె.శంకరరావు, డీవీవీ సత్యనారాయణ, ఎం.ఎస్.ఎన్.రాజు, కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్–2024లో ఉత్తీర్ణత లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఆ రోజు ఉదయం 10 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు సీట్ల ఖాళీల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష రాయకపోయినా స్పాట్ అడ్మిషన్‌ను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, బదిలీ సర్టిఫికెట్(టీసీ), 4 నుంచి 10 తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఈడబ్ల్యూఎస్ అర్హత ఉన్నవారు సంబంధించి ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు మూడు సెట్‌లు జిరాక్స్ కాపీలను తీసుకువాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల రోజున రిజిస్ట్రేషన్ ఫీజు, కళాశాల ఫీజుతో కలిపి సుమారు రూ.5,500 సీటు పొందిన వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో స్వల్ప ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల సందడి


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సీతంపేట: వారంతా పూర్వ విద్యార్థులు... 1974 నుంచి 1977 వరకు బీకాం చదివి వెళ్లిపోయినవారు మళ్లీ ఇప్పుడు కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాల గురించి ఆరా తీసుకున్నారు. ఈ అపూర్వఘట్టానికి నగరంలోని ఓ హోటల్ వేదికైంది. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకరించాలని నిర్ణయం తీసుకున్నారు. కళాశాల స్థాపించిన తర్వాత రెండో బ్యాచ్‌లో సుమారు 52 మంది విద్యార్థుల్లో 38 మంది శనివారం కలుసుకున్నారు. వీరిలో చాలా మంది డాక్టర్లు, లాయర్లు, వ్యాపారవేత్తలు, ఇంజినీర్లుగా స్థిరపడ్డారు.కొందరు పదవీ విరమణ చేశారు. పూర్వ విద్యార్థుల కలయికకు కృషి చేసిన రామారావు, హనుమంతరావు, రాంబాబు, చందు, ఎంవీ సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, రమ, ఉమ, చలపతి, రామమూర్తిలను సహచరులు అభినందించారు.

హమ్మయ్య.. అధికారులు స్పందించారు


బురుజుపేట అర్బన్ హెల్త్ కేంద్రం వద్ద ఇలా.. (సాక్షి కథనం అనంతరం)


ప్రసాద్‌గార్డెన్స్ వద్ద ఇలా.. (సాక్షి కథనం అనంతరం)

సాక్షి ఎఫెక్ట్..

- పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాల తొలగింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

డాబాగార్డెన్స్ : 'కలవరం.. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో ఆందోళన' పేరిట శనివారం 'సాక్షి' ప్రచురించిన కథనానికి జీవీఎంసీ జోన్–4 కార్యాలయ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ స్పందించారు. వీధుల్లో అధ్వానంగా పారిశుధ్యం, దోమల వృద్ధితో విజృంభిస్తున్న విషజ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన అవసరం అని.. కళాజాతాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలంటూ ఆ కథనంలో 'సాక్షి' సూచించింది. నియోజకవర్గ పరిధి గొల్లవీధి, పంజా జంక్షన్, పూర్ణామార్కెట్, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి తదితర ప్రాంతాల్లో అపారిశుధ్యంపై 'సాక్షి' ప్రచురించింది. ఈ వార్తా కథనానికి ఏఎంవోహెచ్ స్పందిస్తూ తగిన చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో డంప్ చేసిన చెత్తని పబ్లిక్ హెల్త్ వర్కర్స్, బాబ్‌కాట్, టిప్పర్ వెహికల్ సహాయంతో తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

జనసేన నేత నుంచి 21 మద్యం సీసాలు స్వాధీనం

అల్లిపురం : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అల్లూరి విజ్ఞాన కేంద్రం సమీపంలో 21 మద్యం బాటిళ్లను ఒక వ్యక్తి వద్ద నుంచి సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ వ్యక్తి 31వ వార్డు జనసేన పార్టీకి చెందిన 199వ పోలింగ్ బూత్ ప్రెసిడెంట్ శీరం రాజు అని తెలుస్తోంది. అతని వద్ద నుంచే మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు భోగట్టా. ఆ బాటిళ్లను టూటౌన్ పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయొద్దని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పోలీసులను కోరినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులను వివరణ కోరగా బాటిళ్లు స్వాధీనం చేసుకోవడం వాస్తవమేనని తెలిపారు.

5 నుంచి శ్రావణమాసం పూజలు


కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి దేవస్థానంలో వచ్చే నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు జరుపనున్నారు. నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులకు దేవస్థానమే పూజా సామగ్రి సమకూర్చనుంది. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు (దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం (రాగి) మహాప్రసాదంగా అందజేస్తారు. శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 16) రోజున వరలక్ష్మీవ్రతం, 19న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలు (ఆగస్టు 9, 16, 23, 30) ప్రత్యేక పూజలు జరపనున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాలంలో ప్రత్యేక క్షీరాభిషేకం, పూజలు, వివిధ అమ్మవార్ల స్తోత్రపారాయణం, మహిళలచే సామూహిక శ్రీచక్రసహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. మొదటి శుక్రవారం (ఆగస్టు 9న) అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించనున్నారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 160వ దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. శనివారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోజు సాయంత్రం స్లీవ్ గుర్తు మండపంలో పతాకావిష్కరణ అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలు వీధుల్లో తిరుగుతుందని 15న ప్రధాన మహోత్సవం నిర్వహిస్తామన్నారు. పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి. వినయ్‌కుమార్, పి.ఆంథోనీ, పీపీసీ అధ్యక్షుడు శ్రీమునిరి రాజేష్, కార్యదర్శి పి. ఫ్రాన్సిస్, జాయింట్ సెక్రటరీ జి. ఆనందరావు, జాయింట్ కోశాధికారి నిర్మల రాజు, రత్నం, గురు మండలి సలహా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బయో కెమిస్ట్రీ జాతీయ సదస్సు


ముగింపు సదస్సులో అతిథులతో విద్యార్థులు, అధ్యాపకులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐఐపీఈ వ్యవస్థాపకులు ఆచార్య కె. ప్రసాద్ పర్యావరణ అనుకూల జీవనం, వ్యర్థ పదార్థాల నిర్వహణ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై పోలీసుల ప్రచారం



ఆకట్టుకుంటున్న ఫ్లెక్సీ

అల్లిపురం : వాహన చోదకులు హెల్మెట్ ధరించాలంటూ పోలీసులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకర్షణీయంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. దీంట్లో భాగంగా టూటౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన 'హెల్మెట్ పెడతావా.. యమపురి వస్తావా' అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పలువురిని ఆకట్టుకుంటోంది.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


ఉపాధ్యాయులతో డీఈవో చంద్రకళ

పెందుర్తి: ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్.పూర్ణచంద్ర, జిల్లా సహాయ ఎ.ఎం.వో జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


డీఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం డీఐజీ గోపీనాథ్ జెట్టిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖ జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు, శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.